క్లుప్తంగా

వైభవంగా కూడారై ఉత్సవం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గీతా మందిరంలో గోదారంగనాథస్వామి పూజల్లో భాగంగా 27వ రోజు శుక్రవారం కూడారై ఉత్సవం నిర్వహించారు. అర్చకులు రాజేంద్రశర్మ గోదా రంగనాథస్వామికి విశేషపూజలు, అష్టోత్తర, సహస్రనామార్చనలు చేశారు. 108 గిన్నెలలో పాయాసన్నం నింపి విశేష అలంకారం మధ్య నివేదనకావించారు. పూజల్లో ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, సభ్యులు గుగ్గిళం మధుసూదనరావు, రాజ్యలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపూడిలో సామాజిక సర్వే



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మపూడి గ్రామంలో జాతీయ యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ కార్యదర్శి టి.భవానీ మాట్లాడుతూ నేటి యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో శ్రమిస్తే ఆశించిన గమ్యాన్ని చేరుకుంటారని వివరించారు. స్వామి వివేకానంద బోధనలను చదివి, ఆయన్ను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం సామాజిక సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు, వైస్ ప్రిన్సిపల్ వై.పూర్ణచంద్రరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జీఓను పరిగణలోకి తీసుకోండి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులు శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ షణ్ముఖరావును కలసి వినతిపత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు తెంపల్లి దుర్గారావు మాట్లాడుతూ కొన్నిచోట్ల సెలూన్ షాపులకు విద్యుత్ బిల్లులను కట్టాలని, విద్యుత్ శాఖ బిల్లులు ఇస్తున్నదని, ప్రభుత్వ జీఓను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన ఏఈ షణ్ముఖరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కోటి, విజయ్, సురేష్, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కవల దోసకాయలు



తాడేపల్లిరూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కృష్ణానది తీరంలో ఉండవల్లికి చెందిన రైతు దంటు రఘునాథరెడ్డి కూరగాయలు సాగుచేస్తున్నాడు. ఒక ఎకరంలో దోసకాయలు వేయగా ఆ పంటలో అక్కడక్కడ ఒక తొడిమెకు కవల దోసకాయలు కనిపించాయి. దీనిపై హార్టికల్చర్ ఏఓ దీపిక మాట్లాడుతూ సంపర్క సమయాల్లో కొన్ని కొన్ని పండ్ల తోటలో, కూరగాయల తోటల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతాయని వీటిని ఉపయోగించడం వల్ల ఎటువంటి నష్టం ఉండదని, మనకి ఎక్కువగా అరటి తోటల్లో ఇలాంటి సంఘటనలు ఎదురౌతాయని అన్నారు.

పేద పాస్టర్లకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: విశ్రాంత టౌన్ చర్చి పాస్టర్ దేవరపల్లి రత్నం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు టైటస్ ఆధ్వర్యంలో నాజరుపేటలోని మిషన్ కాంపౌండ్‌లో శుక్రవారం పేద పాస్టర్లకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి రత్నం దైవసేవలో తన జీవితాన్ని గడిపారని చెప్పారు. కార్యక్రమంలో దేవరపల్లి వినయ్ ప్రకాష్, కారుమంచి సుందర్, మంచాల పాల్, స్టెఫీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



విగ్రహావిష్కరణ ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నాయకులు

తాడికొండ: విజయవాడ నడిబొడ్డులో ఈ నెల 19న అంగరంగ వైభవంగా జరగనున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేసేందుకు వేలాదిగా దళిత, బహుజనులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం గుంటూరులోని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సాధికారత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పదవులు కావాలంటే పార్టీలకు ఊడిగం చేయాల్సి వచ్చేందని, కానీ నేడు అందుకు భిన్నంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న సమసమాజ స్థాపన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారా ఏపీలో అమలవుతుందన్నారు. విజయవాడ నడిబొడ్డున రూ.3 వేల కోట్ల విలువైన స్థలంలో రూ.440 కోట్ల వ్యయంతో 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజనులు, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడన్నారు. గతంలో కంటే నేడు జగనన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పాలనలో, పదవుల్లో, సీట్ల కేటాయింపులో సమన్యాయం జరుగుతుందనేందుకు వివిధ హోదాల్లో, పదవుల్లో ఉన్న నాయకులే నిదర్శనమన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ మోహన్ మాట్లాడుతూ 2004 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వెంటనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఉచితంగా విద్య, 108, 104, ఆరోగ్య శ్రీ వంటి పథకాల ద్వారా ఉచిత వైద్యం చేరువ చేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింతగా రెట్టింపు చేసి రాజకీయాలు, నామినేటెడ్ పదవులతోపాటు పాలనలో అన్ని వర్గాలను భాగస్వాములను చేశాడని కొనియాడారు. ఎంతగా అంటే దళితుడుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా, బీసీలు బ్యాక్ వర్డ్ క్లాస్ అని హేళన చేసిన నాయకులు ఇప్పుడు మేము దళితులు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీలుగా ఎందుకు పుట్టలేదా అని అసూయపడేలా అన్ని వర్గాలకు జగనన్న పాలనలో న్యాయం జరుగుతుందన్నారు. 19న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు లక్షల సంఖ్యలో ప్రజలు హాజరయ్యేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉన్నాయి కనుక సమష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు సర్పంచ్‌లు వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈశ్వరసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- 1850 మందికి వైద్య పరీక్షలు



ఈశ్వరసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, జెడ్పీచైర్మన్ కె.హెనీక్రిస్టినా



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాసరెడ్డి, మేకతోటి దయాసాగర్

ఫిరంగిపురం: చిట్టా ఈశ్వరసాయి ట్రస్ట్ ద్వారా వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ లేళ్లఅప్పిరెడ్డి, జెడ్పీచైర్మన్ కె.హెనీక్రిస్టినా అన్నారు. స్థానిక సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో రేపూడి గ్రామానికి చెందిన చిట్టా ఈశ్వరసాయి 11వ వర్ధంతి సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి నేత్రాలయం, తులసీ హాస్పటల్ (గుంటూరు) ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర, వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈశ్వరసాయి చిత్రపటానికి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఈశ్వరసాయి మృతి తండ్రి బాపూజీరెడ్డికి తీరనిలోటని అన్నారు. ఆమె ఇష్టపడిన వైద్య వృత్తికి న్యాయం చేయాలని ప్రతి ఏటా ఈశ్వరసాయి వర్ధంతి రోజున మెగా వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనేకమందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యసేవలు ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచారని చెప్పారు. ఇటువంటి వైద్య శిబిరాల సమయంలో వారిని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ ఈశ్వరసాయి ఆశయాలకు అనుగుణంగా వారి కుటుంబసభ్యులు ప్రజలకు ఆరోగ్యం చేకూరేలా వైద్యశిబిరాలు నిర్వహించడం విశేషమని చెప్పారు. అనంతరం ఈశ్వరసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిబిరంలో 1850 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా బాలఏసు దేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బి.బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ప్రత్యేకాధికారి ఎం.వెంకట్రామిరెడ్డి, చిట్టా విజయభాస్కరరెడ్డి, ఎస్.హబీబుల్లా, బాపూజీరెడ్డి, భరద్వాజ్‌రెడ్డి, జి.నాగలక్ష్మి, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పిరెడ్డి, చౌదయ్య, బి.అంజిరెడ్డి, మెల్కియా, మస్తాన్‌వలి, కమలారెడ్డి, రామమోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, ఎస్.నాగరాజు, బూసిరెడ్డి, శివారెడ్డి, కమలారెడ్డి, హేమలతారెడ్డి, నరేంద్ర, ఎస్.జోజప్ప, ఎంపీడీవో విలియమ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తాం

- ప్రజలు, భక్తుల కోరిక మేరకు బారికేడ్లు తొలగింపు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిరంజీవి



బారికేడ్ల తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త చిరంజీవి

తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ప్రతి రోజూ రాష్ట్రంతోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు విచ్చేస్తున్నారని, భక్తులు, స్థానికుల సూచనల మేరకు నరసింహస్వామి దేవస్థానం వద్ద వున్న బారికేడ్లు తొలగిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. వారు అధికారులతో కలసి శుక్రవారం బారికేడ్ల తొలగింపు పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ దిగువ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు దూరంగా వాహనాలు నిలిపి దర్శనానికి వెళ్లాల్సి వస్తోందని, మళ్లీ ఎగువ ప్రాంతంలో దర్శనానికి వెళ్లాలంటే ఎక్కడో పార్క్ చేసిన వాహనాలను తీసుకువచ్చి పట్టణం మొత్తం తిరిగి పైకి వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగా ఉన్న పెద్దలు, మరికొంతమంది సూచనల మేరకు ఈ బారికేడ్లను తొలగిస్తున్నామని, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, బారికేడ్లు తొలగించడం వల్ల భారీ వాహనాలు వస్తాయేమోనని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారని, వాహనాలు రాకుండా పోలీసు వారితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భావన్నారాయణ, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, బేతపూడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని గ్రామంలో నంగనం శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆర్థిక సహాయాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తికొండ రామకృష్ణారెడ్డి, గండికోట హేమకుమార్, దేశబోయిన కాటమరాజు, మాజీ సర్పంచ్ మద్రి వెంకయ్య, జలసూత్రం నాగరాజు, కలవకొల్లు సాంబశివరావు, గుర్రం శంకర్, గ్రామ పెద్దలు గుర్రం కోటయ్య, కన్వీనర్ కటారి రామనాగు తదితరులు ఉన్నారు.

రేవేంద్రపాడులో.....

దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన శృంగారపాటి శిరోమణి అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ బాజీ, వార్డు మెంబర్లు మొండితోక సురేష్, కొప్పుల ప్రకాష్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పలుకూరి శామ్యూల్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దైవజ్ఞాన కళాశాల విద్యార్థుల ర్యాలీ

తెనాలిటౌన్: ఆంధ్ర క్రైస్తవ వేదాంత కళాశాల విద్యార్థులు, పాస్టర్లు కొలకలూరు గ్రామంలో శుక్రవారం పరిచర్యలో భాగంగా సువార్త ప్రకటిస్తూ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ వీధుల్లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పాస్నెకంటి సువర్చల శశికిరణ్ ఆధ్వర్యంలో రెవ. డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాస్టర్లు వై.చంద్రబాబు, వర్ల బాసు, సురేష్, చింతపల్లి మురళీధర్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



40 సంవత్సరాల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణమూర్తి విగ్రహానికి శంకుస్థాపన నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1983–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన 160 మంది పూర్వ విద్యార్థులకుగాను 111 మంది హాజరయ్యామని, 16 మంది పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందారని అన్నారు.

అనంతరం తమకు విద్య నేర్పిన గురువులు జాలాది వీరయ్య చౌదరి, భాస్కర శాస్త్రి, బుచ్చి రామయ్య, కోటేశ్వరరావు, ముసునూరి ప్రసాద్, కనకమేడల రవీంద్రలను సత్కరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు జాలాది వీరయ్య మాట్లాడుతూ 40 సంవత్సరాల తరువాత స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరావు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహణ కమిటీ ప్రతినిధులు భావన శ్రీనివాసరావు, దుర్గారావు, హైమావతి, శేషగిరిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రగతికి విద్యార్థులు పునాదులు కావాలి

శ్రీ విష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.మనోజ్ కుమార్



పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

తాడేపల్లిరూరల్: సాంకేతిక ప్రగతికి విద్యార్థులు పునాదులు కావాలని, నేటి విద్యార్థులు రేపటి భవిష్యత్తు శాస్త్రవేత్తలు అని శ్రీ విష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.మనోజ్ కుమార్ అన్నారు. శుక్రవారం మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ విష్ణు జూనియర్ కళాశాల 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తు ప్రగతి మార్గంలో పయనించడానికి ఉపయోగపడుతుందని, సాంకేతిక ప్రగతికి, సమాజ ప్రగతికి, సమాన అవకాశాలు మెరుగుదలకు విద్యార్థులు పునాది రాళ్లు కావాలని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి వేడుకలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వీజేపీ, డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వీసం జవహర్‌లాల్, రవీంద్ర, అధ్యాపకులు సీహెచ్. జనార్ధన్, వి.సతీష్, కె.రమణారెడ్డి, బి.శ్రీనివాసరావు, సత్యదూన్, లక్ష్మీనారాయణరావు, కె. జ్యోతిపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న పాఠశాల హెచ్ఎం పి చంద్రశేఖర్, సర్పంచ్ పలుకూరి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి చంద్రశేఖర్, సర్పంచ్ పలుకూరి మేరమ్మలు శుక్రవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాడు–నేడు కింద నూతన భవనాల ఏర్పాటుతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, విద్యకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత ఇప్పటివరకు ఎవ్వరూ ఇవ్వలేదని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ టెక్నాలజీతో కూడిన ట్యాబ్‌లను అందజేస్తున్నారని దీని వల్ల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరుస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ బాజీ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాశరావు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ అభ్యున్నతికి కృషి చేయాలి

ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్



మాట్లాడుతున్న ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్

తాడేపల్లిరూరల్: ఉన్నత చదువులను పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆవరణలో మొట్టమొదటి పూర్వ విద్యార్థుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 2017 నుంచి ఇప్పటి వరకు ఇంజినీరింగ్ చదువులు పూర్తిచేసుకున్న పలువురు విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సొంత ఊరును, చదువుకున్న విద్యాసంస్థను విద్యార్థులు మరచిపోరాదని, క్రమశిక్షణ, శ్రమించే తత్వం విద్యార్థుల ఉజ్వల భవితకు పునాదులు వేస్తాయని సూచించారు. రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ విష్ణుపథ్, డాక్టర్ జయశీలన్, పారిస్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ భరద్వాజ్‌లు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, అలూమ్ని రిలేషన్స్ డైరెక్టర్ స్రబని బసు, పలువురు డీన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వివేకానంద జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, వివేకానంద బోధలను ఆచరించి దానిని అమలు చేస్తే జీవితంలో ఎంతో మార్పు వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇప్పటం అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వరరావు, తులసి దాసు, వీరంకి హరిబాబు గౌడ్, ప్రవీణ్, రాజేశ్వరరావు, అమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, గాజుల లక్ష్మీనారాయణ, గాజుల నగేష్, బ్రహ్మారెడ్డి, శివారెడ్డి, పద్యాల జాన్‌బాబు, రామిరెడ్డి, అశోక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

దుగ్గిరాల గ్రామంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయినరామస్వామి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు షేక్ సుభాని, కుర్రా నాగయ్య, గండు పాములు, తాడిబోయిన నరసింహారావు, దానబోయిన శివాజీ, చింతమనేని కొండయ్య, తాడిబోయిన వెంకటనారాయణ, పసుపులేటి నాగయ్య, ఉన్నం బాబూరావు, ఆంజనేయులు, దేవయ్య, ఎల్లయ్య, గరిక శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలపతి కళాశాలలో...

మోతడక(తాడికొండ): యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, లైబ్రరీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో జస్ట్ ఎ మినిట్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువకులకు స్ఫూర్తి నింపిన వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగశ్రీనివాసరావు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి ఎస్ శాంతిప్రియ, లైబ్రరియన్ ఏవీవీ రాజేష్‌బాబు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిత

అనంతపురం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు పి విజయ్‌కుమార్



విద్యార్థులకు సందేశం అందిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ పి విజయ్‌కుమార్

పెదపరిమి(తాడికొండ): యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అనంతపురం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు, అసోసియేట్ ప్రొఫెసర్ పి విజయ్‌కుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో ఎస్ఎస్‌సీజీడీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విగ్రహంలా వందేళ్లు బతకడం కన్నా విద్యుత్తులా ఒక్క క్షణం వెలిగేలా యువత ఆలోచనలు ముందుకు నడవాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి భావాలు అలవడాలని పిలుపునిచ్చారు. యువత పది మందికి మార్గదర్శకులుగా మారాలంటే జీవన విధానంలో ఉన్నత విలువలను జోడించుకొని ముందుకు నడవాలని సూచించారు. అనంతరం రామ్‌కీ ఫౌండేషన్ ప్రతినిధి నరసింహారెడ్డి, ఫ్యాకల్టీ వెంకట రమణలు అతిథి విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై స్పందించని వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



తాడేపల్లిరూరల్: బీసీల సమస్యలపై స్పందించని బీసీ ప్రజాప్రతినిధులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి పట్టణ పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల ఓట్లతో గెలిచి వారి సమస్యలపై ఏ రోజైనా ప్రజాప్రతినిధులు మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీల అభ్యున్నతి కోసం ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలను విస్మరించే పార్టీలు కనుమరుగైపోతాయని అన్నారు. జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, కె.శివరావు, ఉప్పాల రాజ్‌కిరణ్, ఆలా శివాజీ, కాట్రు ధనుంజయరావు, మంద్రు సత్యనారాయణ, తిరువీధుల కిరణ్ పాల్గొన్నారు.